# కనువిందు చేస్తున్న దేవతాపుష్పాలు



చౌడేపల్లి, జూన్ 10 ప్రభాతవార్త

దేవతాపుష్పాలుగా పిలువబడే బ్రహ్మకమలాలు విరబూసి కనువిందు చేస్తున్నాయి. పట్టణంలోని కూరపర్తి శ్రీనివాసులు ఇంట బ్రహ్మకమలాల చెట్టు వుంది. ఆ చెట్టు నిండా పుష్పాలు పూశాయి. ఆకు నుంచి మాత్రమే పూసే ఈ పుష్పాలు హిమాలయాల్లో పూస్తాయనీ, బ్రహ్మదేవుడు వీటిని ఆసనంగా కల్గివుండటం వల్ల బ్రమ్మకమలాలంటారని పండితులు అంటున్నారు. పరమశివుడికి ప్రీతిపాత్రమైన ఈ పుష్పాన్ని ఉత్తరాఖండ్ రాష్ట్రం జాతీయపుష్పంగా ప్రకటించింది. అంతేకాకుండా తపాలాశాఖ పుష్పం ఆకారాన్ని ముద్రించి అరుదైన గౌరవాన్ని ఇచ్చింది. రాత్రిళ్ళు మాత్రమే వికసించే బ్రహ్మకమలాలు సుగంధ వాసన వెదజల్లుతూ అందరినీ ఆకర్షిస్తున్నాయి.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# జడ్పీ డిప్యూటీ సిఇఓగా వెంకట నారాయణ బాధ్యతలు స్వీకరణ

చిత్తూరు, జూన్ 10 ప్రభాతవార్త:



జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఓగా వెంకట నారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా జడ్పీ డిప్యూటీగా విధులు నిర్వహిస్తున్న జుబేదా కడప జిల్లా డ్వామా విజిలెన్స్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ప్రభుత్వం తిరుపతి తుడా కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ సెలవుపై వున్న వెంకట నారాయణను చిత్తూరు జిల్లా జడ్పీ డిప్యూటీ సిఇఓగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ మేరకు ఆయన జడ్పీ డిప్యూటీ సిఇఓ ఛాంబర్‌లో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ డిప్యూటీ సిఇఓగా బాధ్యతలు స్వీకరించిన వెంకటనారాయణ జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే జడ్పీ డిప్యూటీ సిఇఓగా విధులు నిర్వహిస్తు బదిలీపై కడప జిల్లా డ్వామా విజిలెన్స్ ఆఫీసర్‌గా వెళ్తున్న జుబేదాను జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు సన్మానించి ఘనంగా విడ్కోలు పలికారు.

# సూర్య ఘర్‌యోజనపై క్లస్టర్ స్థాయి సమావేశాలు

## సోలార్ మేళా పేరిట అవగాహన సదస్సులు

## సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునే వారికి బ్యాంకు రుణాల మంజూరుకు చర్యలు : కలెక్టర్



సూర్య ఘర్ యోజన పథకం అమలుపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూన్ 10 ప్రభాతవార్త:

సూర్య ఘర్ యోజనపై ప్రజలకు మరింత విస్తృతంగా అవగాహన కల్పించడానికి క్లస్టర్ స్థాయి సమావేశాల నిర్వహణకు శ్రీకారం చుట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలిసి సూర్య ఘర్ యోజన పథకం అమలుకు సంబంధించి ట్రాన్స్‌కో, నెడ్‌క్యాప్, జిల్లా పరిషత్, డిఆర్‌డిఎ, బ్యాంకర్లు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగం పెంచడానికి సోలార్ రూఫ్ టాప్ ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్‌తో ఇంటి అవసరాలు తీర్చుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌కు అమ్ముకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ విషయంపై అవగాహన పెంచడంలో భాగంగా క్లస్టర్ స్థాయిలో విరివిగా సమావేశాలు నిర్వహించాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నప్పటికీ మొదట మొత్తం నగదు చెల్లించిన తరువాత ప్రభుత్వ రాయితీ పొందే అంశంపై వినియోగదారులకు ఆసక్తి తగ్గుతోందని, ఇందుకు బ్యాంకుల్లో రుణ సదుపాయం ద్వారా నెలవారీ వాయిదాల్లో చెల్లింపులు చేసేలా బ్యాంకర్లు రుణాల మంజూరుకు చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలీర్ రూఫ్ టాప్ ఏర్పాటు, ఇతర రాయితీ వివరాలను పూర్తి స్థాయిలో నివృత్తి చేయడానికి మండల గ్రామ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయి కమిటీలో డిఆర్‌డిఎ ఎపిఓలు, ట్రాన్స్‌కో ఎఇలు, బ్యాంకర్లు ఒక కమిటీగా ఏర్పాటు కావాలని, అలాగే గ్రామ స్థాయిలో సచివాలయ సిబ్బంది, డిఆర్‌డిఎ, మెప్మా సిబ్బందితో సంబంధిత బ్యాంకు అధికారులు కమిటీగా ఏర్పాటై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి వున్న వినియోగదారులకు వ్యక్తిగతంగా మాట్లాడి వారికి అవసరమైన రుణ సహాయం నిమిత్తం సంఘాల్లోని మహిళలకు స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకుల ద్వారా అందించడానికి చర్యలు చేపట్టడంలో భాగంగా కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన పెంచడంలో నిమగ్నం కావాలన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్, నెడ్ క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుర్ రయాజ్, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, ఎల్‌డిఎం హరీష్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై శ్రీవారు

## కన్నుల పండువలా శ్రీవారి కల్యాణం





వడమాలపేట, జూన్ 10 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి మంగళవారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా వాహన మండపం చేరుకున్న స్వామివారు సుందరంగా అలంకృతుడై అలంక రించిన కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి పుర వీధుల్లో విహరించారు. భక్తులు హారతులు సమర్పిస్తూ స్వాగతం పలికారు. 9 గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న శ్రీనివాసునికి స్నపన తిరుమంజనం నిర్వహించారు.

### వైభవంగా ప్రసన్న వెంకటేశ్వరుని కల్యాణం

అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి మంగళవారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటల నుంచి శ్రీనివాసుని కల్యాణాన్ని ప్రధాన అర్చకులు సూర్యకుమారా చార్యులు, కంకణ బట్టర్ తిప్పయాచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆర్జిత కల్యాణోత్సవం టికెట్లు తిసుకున్న దంప తులకు శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అంద జేశారు. అనంతరం రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, వేద పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో నకిలీ వైద్యుడు..?

## ప్రైవేట్ ఆస్పత్రిలో కడ పి.డి. ఆకస్మిక తనిఖీ - కుప్పంలో వెలుగు చూసిన వైనం.. ఆస్పత్రి సీజ్‌కు చర్యలు !!






కుప్పం, జూన్ 10 ప్రభాతవార్త

కుప్పం పట్టణం ప్యాలస్ రోడ్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో నకిలీ వైద్యుడి భాగోతం వెలుగు చూసింది.దీంతో ఆస్పత్రిని సీజ్ చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని కడ పి.డి. పేర్కొంటూ తగు చర్యల నిమిత్తం డిఎంహెచ్ఒకు ఆదేశించారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ కుప్పం శాఖ ఫిర్యాదుతో ఆస్పత్రిలో కడ పి.డి. తనిఖీ నిర్వహించారు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. కుప్పం పట్టణం ప్యాలస్ రోడ్‌లో ఎ.ఆర్. హాస్పిటల్, నర్సింగ్‌హోంను డా॥ అరుణ్ అన్నాత్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. ఇతను ఈ కేంద్రంలో అన్ని రకాల నొప్పులు, అన్ని రకాల రక్తపరీక్షలు, చక్కెర వ్యాధి ట్రీట్‌మెంట్, కేన్సర్ ట్రీట్‌మెంట్,ప్రమాదాల ఎమర్జెన్సీ, అన్ని రకాల సర్జరీలు నిర్వహిస్తామని పెద్ద బోర్డు సైతం పెట్టాడు. ఇతను తన క్వాలిఫికేషన్ ఎంబిబిఎస్, ఎంఎస్‌గా పేర్కొంటూ సర్జికల్ ఆంకాలజిస్టుగా బోర్డులో పేర్కొన్నాడు. దీంతో కొంతకాలంగా ఆస్పత్రికి రోగులు వస్తూ వెళ్తున్నారు. కాగా గత నెలన్నర రోజుల క్రితం జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించి మెడికల్ షాపును సీజ్ చేశారు. ఇదిలా ఉండగా కుప్పం శాఖ ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదుతో మంగళవారం రాత్రి కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆస్పత్రికి చేరుకుని తనిఖీ చేశారు. ఆస్పత్రి, వైద్యుడి రికార్డులు పరిశీలించగా అరుణ్ అన్నాత్ నకిలీ వైద్యుడని తేలినట్లు సమాచారం.అతని వద్ద ఎలాంటి సర్టిఫికెట్లు లేవని తేలడంతో ఆస్పత్రి సీజ్‌కు కడ పి.డి. జిల్లా వైద్యఆరోగ్యఅధికారిని ఫోన్‌లో ఆదేశించారు. కాగా నకిలీ వైద్యుడిని కుప్పం పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో కడ సలహామండలి సభ్యులు డా॥ బిఆర్ సురేష్‌బాబు, కుప్పం ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటిండెంట్ డా॥ విజయకుమారి, కౌన్సిలర్ జిమ్‌దాము, స్థానిక వైద్యులు డా॥ సురేష్ మునిరత్నం, డా॥ క్రాంతి పాల్గొన్నారు.

# షణ్ముఖునికి వెండి కవచం బహూకరణ



శ్రీకాళహస్తి,జూన్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయానికి ఓ భక్తుడు సుమారు రూ.5లక్షల విలువ కల్గిన వెండి ఉరువులను వితరణగా అందించారు. ఈ ఆలయంలో వెలసిన సుబ్రమణ్యం స్వామి షణ్ముఖుడుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ప్రతి మంగళవారం పట్టణంలోని నలుమూలల నుంచి భక్తులు పూజల్లో పాల్గొంటున్నారు. వేలాది మంది ఇక్కడ స్వామి వారికి షోడషాభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయ నిర్వాహకులు ఎస్ఎంకె పరశురామ్ గురుకుల్ (అచ్చితా గురుకుల్)తో సంప్రదించారు. అయితే స్వామి కి ఏదైనా వస్తువులు తయారు చేసి ఇవ్వమని చెప్పినట్లు సమాచారం. దాంతో గ్రీన్ ప్యానల్‌లో పని చేస్తున్న సెక్షన్ ఇంజనీర్ రత్నకుమార్ రూ.5లక్షల విలువ చేసే వెండి ఉరువులను తయారు చేసి అందించారు. స్వామి వారికి కొత్త అందాలనిచ్చే కవచాన్ని తయారు చేయించారు. దానిని మంగళవారం అచ్చితా గురుకుల్‌ద్వారా ఆలయంలోని పూజారి మురళి ప్రసాద్,జయకుమార్‌లకు అందించారు. కవచంలో ఓ ప్రత్యేకత సంతరించుకుంది. కవచంలో చేతిలో శివలింగం ఉంది.

ఈ సంప్రదాయం తమిళనాడులోని శివగంగై పిళ్ళాయారిపట్టిగ్రామంలో ఉన్న విఘ్నేశ్వరుని చేతిలో శివలింగం ఉంటుంది. అలాగే పళని చిన్నమలై అనే ఊర్లో కొండమిద వెలసిన మహావిష్ణువు చేతిలో శివలింగం ఉంటుంది. వారు శివపూజలు జరిపినట్లు ఆధారం. ఈ సంప్రదాయాన్ని సుబ్రమణ్యం స్వామి చేతిలో శివలింగాన్ని తయారు చేయాలని అచ్చితా స్వామి సూచనల మేరకు తయారు చేసి మంగళవారం అప్పగించారు. ఈ కవచం స్వామి ప్రత్యేకంగా ఉంది.

# ఎస్వీసీఈ క్యాంటీన్ భవనంపై నుంచి దూకిన విద్యార్థి..

తిరుపతి విద్య జూన్ 10 ప్రభాత వార్త..

కరకంబాడి రోడ్డు లో ఉన్న ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల క్యాంటీన్ భవనం పైనుంచి విద్యార్థి దూకిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది.కళాశాల సిబ్బంది సమాచారం మేరకు.. కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్న బాలాచారి మంగళవారం ఉదయం అల్పాహార సమయంలో క్యాంటీన్ భవనం పైకి ఎక్కి ఒక్కసారిగా కిందకి దూకేశాడు.ఈ సంఘటనలో విద్యార్థి కాలికి బలమైన గాయమైంది.వెంటనే అప్రమత్తమైనా కళాశాల యాజమాన్యం సదరు విద్యార్థిని నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించి వైద్య పరీక్షలు చేయించారు. విద్యార్థి కాలుకు బలమైన గాయమైనట్టు గుర్తించి వైద్య సేవలు అందించారు. ప్రమాదం విషయాన్ని శ్రీకాళహస్తిలోని విద్యార్థి తండ్రి విజయభాస్కరాచారికి సమాచారం ఇవ్వడంతో ఆయన హాస్పిటల్ వద్దకు చేరుకున్నారు. విద్యార్థి మానసిక స్థితి సరిగాలేదని,చదువుపై కూడా ఆసక్తి లేదని, కారణంగానే తమ కొడుకు ఇలా చేశాడని విద్యార్థి తల్లిదండ్రులు చెప్పారు.అయితే సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

## ధ్వజావరోహణంతో ముగిసిన

# గోవిందరాజుని బ్రహ్మోత్సవాలు



తిరుపతి, జూన్ 10ప్రభాతవార్త:

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో తొమ్మిదిరోజులు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. అంతకు ముందు ఉదయం ఉత్సవమూర్తులను, చక్రత్తాళ్వార్‌ను ఆలయం నుండి కపిలతీర్థంలో ఉన్న పవిత్ర పుష్కరిణి వద్దకు మంగళవాయిద్యాల నడుమవేంచేపుచేశారు. ఆళ్వార్‌తీర్థంలో ఉదయం 8గంటల నుండి 9.30గంటల మధ్య చక్రధారుడి చక్రస్నాన మహోత్సవం వైభవంగా ముగిసింది. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు.

## అభిదేయక అభిషేకంలో

# ముత్యపురవచంలో మలయప్ప అభయం





తిరుమల,జూన్ 10ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవారి ఆలయంలోని సంపంగిప్రాకారంలో మలయప్పస్వామి ఉత్సవర్ల జ్యేష్టాభిషేకాల్లో రెండవ రోజు మంగళవారం సాయంత్రం ముత్యపుకవచంలో కనువిందుచేశారు. శ్రీదేవిభూదేవిసమేతుడైన మలయప్పకు ఉదయం వేదపారాయణదారులు, ఆలయ అర్చకులు మహాశాంతి హోమం, విశేష స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఆ తరువాత శ్రీదేవిభూదేవిసమేత మలయప్ప ఉత్సవమూర్తులకు ముత్యపుకవచం అలంకరింపజేశారు. సాయంత్రం సహస్రదీపాలంకారసేవలో ఊంజల్‌సేవలో వయ్యారంగా ఊరేగిన మలయప్ప ఉభయదేవేరులు ఆలయ మాఢవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ ఏవిఎస్ఓ రాజశేఖర్, ఆలయ అర్చకులు , గృహస్థభక్తులు పాల్గోన్నారు.

## పండువెన్నెల్లో

# భోళాశంకరుని ఊంజల్‌సేవ

శ్రీకాళహస్తి,జూన్ 10 ప్రభాతవార్త



పండువెన్నెల చల్లని వాతావరణం భక్తి భావం ఉట్టిపడే ఆలయం శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం స్వామి అమ్మవార్ల ఊంజల్‌సేవ కనువిందు చేసింది. వేలాది మందిభక్తులు భక్తిభావంతో పరవశించిపోతూ స్వామి అమ్మవార్లను ఊయల్లో దర్శనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి భోళా శంకరుడు వాయులింగేశ్వరుడు,దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవార్లను అలంకారమండపంలో కన్నుల పండువగా చూడటానికివేయి కళ్ళు చాలవన్నట్లు ముస్తాబు చేసారు. అలంకారాన్ని ఇంత అందమా? అన్నట్లు తీర్చి దిద్దారు. సాయంత్రం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నైవేద్యం,దీపారాధన తరువాత స్వామి అమ్మవార్లను ఆలయాధికారులు,భక్తులు హరోం హర అంటూ శివ శివ శంభోశంకరా అంటూ నినాదాలు చేస్తూ స్వామి అమ్మవార్లను అలంకారమండపం నుంచి భక్తులు మోసుకకుంటూ పొగడమాను వద్దకు తీసుకువచ్చారు. అక్కడ దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని నాలుగుకాళ్ళ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయల్లో ప్రతిష్టించారు. సోమాస్కందమూర్తి అయిన వాయులింగేశ్వరుని కోట మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఊయల్లో ప్రతిష్టించారు. భక్తుల పరవశించి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటుండగా కన్నుల పండువగా ఊయల సేవను నిర్వహించారు.ఈ కార్యక్రమాలను ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణంయాదవ్, టెంపుల్ ఇన్స్ పెక్టర్ సుదర్శనం నాయుడుల పర్యవేక్షణలో వేదపండితులు కార్యక్రమాలను నిర్వహించారు.

## జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో

# 'స్లో మోటార్ సైకిల్ రైడింగ్' పోటీలు

- ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, జూన్ 10 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా పోలీసు ఆధ్వర్యంలో స్లో మోటర్ సైకిల్ రైడింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. మోటర్ సైకిల్ నడుపువారిలో సహనం, మోటర్ సైకిల్‌ను బ్యాలెన్స్ చేయు సామర్థ్యం పెంపొందించి రోడ్డు ప్రమాదాల కట్టడి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. పోటీ దారులు 100 మీటర్ల దూరంను ఉపయోగించుకుని స్టార్టింగ్ లైన్ నుండి ఎండింగ్ లైన్ వరకు కాలు కింద మోపకుండా చిట్టచివరి వరకు ఎవరైతే మోటర్ సైకిల్‌పై వెళ్తారో అతనిని ఆ రౌండ్ విజేతగా ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో ప్రతి బ్యాచ్‌లో కొంత మందిని అనుమతించి పోటీలు నిర్వహించడం జరుగుతుందని, మొదటి రౌండ్ అన్ని బ్యాచుల్లో విన్నర్ రెండవ రౌండ్‌కు క్వాలిఫై అవుతారన్నారు. రెండవ రౌండ్‌లో క్వాలిఫై అయిన వారు మూడవ రౌండ్‌కు క్వాలిఫై అవుతారన్నారు. వచ్చిన పోటీ దారుల సంఖ్యను బట్టి రౌండ్ల సంఖ్య నిర్ధారించడం జరుగుతుందన్నారు. ఇలా చివరి రౌండ్‌లో పోటీ పడిన మొదటి మూడు స్థానాలకు వరుసగా 20 వేల రూపాయలు, 15 వేల రూపాయలు, 10 వేల రూపాయలు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు.

18 సంవత్సరాలు పూర్తయి, సరైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన స్త్రీ, పురుషులు పోటీకి అర్హులన్నారు. అలాగే వాహనం రికార్డులను కలిగి వుండాలని, హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని, ఎఎల్ఆర్ కలిగి వున్న వారికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి కల్గిన వారు ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వాట్సాప్ నెంబర్ 94910 74515కు వివరాలు పంపి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీ నిర్వహించే తేదీ, ప్రదేశం త్వరలో ప్రకటించడం జరుగుతుందన్నారు.

## బోడపాటి కుటుంబంను పరామర్శించిన నగరి ఎమ్మెల్యే

శ్రీరంగరాజపురం, జూన్ 10 ప్రభాతవార్త:



మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని బోడపాటి సుబ్రమణ్యం నాయుడు కుటుంబ సభ్యులను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళవారం పరామర్శించారు. ఇటీవలక బోడపాటి సుబ్రమణ్యం నాయుడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. బోడపాటి కుటుంబం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఆ పార్టీ విజయంలో కీలకపాత్ర పోషిస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సుబ్రమణ్యంనాయుడు సోదరులు బోడపాటి ఆనందనాయుడు, బోడపాటి లోకనాథం నాయుడులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే సానకుప్పం గ్రామంలో జరిగిన జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. మాజీ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రనాయుడు నివాసంలో కొద్దిసేపు ఎమ్మెల్యే గడిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేశం నాయకుడు గంధమనేని రాజశేఖర్‌నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాజేంద్రనాయుడు, ఝాన్సీ భాస్కర్‌నాయుడు, నాయకులు బాలాజీనాయుడు, మేమననాయుడు, తులసీనాయుడు, కార్వేటినగరం మండల తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో తల్లి బిడ్డ ఆరోగ్యం

శ్రీరంగరాజపురం, జూన్ 10 ప్రభాతవార్త:

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లి బిడ్డ ఆరోగ్యంగా వుండవచ్చునని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. ఆరిమాకులపల్లి పిహెచ్‌సిలో మంగళవారం పిఎంఎస్ఎంఎ పథకం కింద గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు సకాలంలో భోజనం చేయాలని, మందులు సకాలంలో వేసుకోవాలని, పరిసరాల్లో లభ్యం అయ్యే ఆకుకూరలు, పాలు, కోడిగుడ్లు, తాజా పౌష్టికాహారాలు తీసుకోవాలని సూచించారు. జిడినెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌరీ, డాక్టర్ బాలాజీ చరణ్, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు పాపిరెడ్డి, వైద్య సిబ్బంది, గర్భిణీలు పాల్గొన్నారు.

## పులిచెర్ల సిడిపిఓగా వాణిశ్రీ

సదుం, మే 10, ప్రభాతవార్త



పులిచెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపివోగా వాణిశ్రీ మంగళవారం బాధ్యతల స్వీకరించారు. రొంపిచర్ల, పులిచర్ల, సదుం మండలాల పరిధిలోని ఈ ప్రాజెక్టుకు ఆమె పదవి బాధ్యతలు స్వీకరించగా పలువురు అంగన్వాడి కార్యకర్తలు, సూపర్వైజర్లు, ఆయాలు వెళ్లి ఆమెకు స్వాగతం పలికారు. పలు విషయాలపై చర్చించారు. అందరి సహకారంతో అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దు తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు.

## రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ

రొంపిచెర్ల, జూన్ 10, ప్రభాతవార్త:



రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేసినట్లు రొంపిచెర్ల రైతు సేవా కేంద్ర సిబ్బంది వెంకటరమణ నాయక్ తెలిపారు. రొంపిచెర్ల, బోడిపాటి వారి పల్లి గ్రామపంచాయతీలలోని రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రైతులకు వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్టె ఎరువులు, జనుములు, జీలగలు విత్తనాలను కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీం ఖాన్, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, కూటమి నాయకులు రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డును అందుకున్న యర్రావారి పాలెం ఆదర్శ పాఠశాల విద్యార్థులు

యర్రావారిపాలెం, జూన్ 10, ప్రభాతవార్త:




యర్రావారిపాలెం మండలం లోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు టి. జ్ఞానేశ్వర్, ఎం. ఉదయశ్రీ, ఎం. రోషన అవార్డును అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ బిటి.శ్రీదేవి తెలిపారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియం నందు జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, డిఈఓ కెవిఎన్ వి. కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## కిశోరి వికాసం పై వేసవి శిక్షణ కార్యక్రమం

కల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త



పులిచర్ల పరిధిలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడి కేంద్రంలో సిడిపిఓ వాణి శ్రీదేవి ఆధ్వర్యంలో కిశోరి వికాసం వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రచారాలు, నివారణ పై 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు బాలికలకు తల్లులకు అవగాహన కల్పించారు. కిశోరి వికాసం వేసవి కార్యక్రమం మే 2వ తేది నుంచి జూన్ 25, 10వ తేది వరకు జరిగింది. కిశోరి బాలికలకు విద్యా, న్యూట్రిషన్ ఫుడ్, వ్యక్తిగత పరిశుభ్రత, మహిళా సాధికారిత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎ. రమాదేవి, ఎన్. విజయలక్ష్మి, ఎంఈఓ శిద్ధ రామయ్య, అంగన్‌వాడి వర్కర్స్ మెభీన, పార్వతి, అన్నపూర్ణ, సుజాత, శ్యామల, సరళ, వాణి, కిశోరి బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

## 13న విజయ వినాయక గణపతి కళ్యాణోత్సవం



చౌడేపల్లి, జూన్ 10 ప్రభాతవార్త మండలంలోని ఆమినిగుంట పంచాయతీ శింగిరిగుంటలో ఈనెల 13న విజయ గణపతి కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యేటా ప్రతిష్టాత్మకంగా జరిగే కళ్యాణోత్సవంలో ఉదయాన్నే ఆలయంలో గంగపూజ, సిద్ది, బుద్ది సమేత వినా యక స్వామికి మహారుద్రాభిషేకం, సాయంత్రం గ్రామంలో ఊరేగింపు ఉంటుందనీ, భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

చౌడేపల్లి, జూన్ 10 ప్రభాతవార్త ఈనెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ లీలామాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో జరిగే సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

## ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

సోమల, జూన్ 10, ప్రభాతవార్త సినీ హీరో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు సోమల బస్టాండ్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ అభిమాన సంఘ నాయకులు రెడ్డి పార్థసారథి, వై వి సుబ్బయ్య సీట్లు బస్టాండ్ నందు కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు బాలకృష్ణ జన్మదిన వేడుకల సందర్భంగా బస్టాండ్‌లో మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఇరికి పేట చెరువు అభివృద్ధి కమిటీ చైర్మన్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో జనసేన రాయపాటి అరుణ

కాణిపాకం, జూన్ 10 ప్రభాతవార్త:



జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ కుటుంబసమేతంగా మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీనాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట పూతలపట్టు జనసేన నాయకులు మోహన్‌బాబు,మహేష్ స్వేరో, పార్థు,యోగరాజు, పవన్‌కుమార్, ఉదయ్, చైతన్య, కిషోర్, బాలసుబ్రమణ్యం, చిన్న, యువరాజ్ స్వేరో తదితరులు పాల్గొన్నారు.

## అర్ధగిరిని దర్శించుకున్న అరుణ

తవణంపల్లె, జూన్ 10 ప్రభాతవార్త:

జనసేన రాష్ట్ర అధికార ప్రతనిధి రాయపాటి అరుణ మంగళవారం కుటుంబసమేతంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. వారి వెంట జనసేన సీనియర్ నాయకులు మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు(చిన్న), మహేష్ స్వేరో, బాలు తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న వినాయక కళాశాల విద్యార్థి

సదుం, జూన్ 10, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులను సోమవారం చిత్తూరులో మండల విద్యార్థులు అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన స్థానిక వినాయక కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థి బి చరణ్ తేజ్ కలెక్టర్ అమిత్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆ విదార్థికి 20 వేల రూపాయలు నగదు, ప్రశంస పత్రం అందజేశారు. చరణ్ తేజ్‌ని కళాశాల యాజమాన్యం అభినందించారు.

## సచివాలయాల్లో మున్సిపల్ కమీషనర్ తనిఖీలు

కుప్పం, జూన్ 10 ప్రభాతవార్త



కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఐదు సచివాలయాల్లో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సచివాలయాల్లో ఉద్యోగుల హాజరు, రికార్డులు పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు, పెన్షన్లు అందేలా చూడాలని ఆదేశించారు. సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.ప్రజలకు వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈనెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంకు సంబంధించి 100 ప్రదేశాలు గుర్తించామని అక్కడ తగు ఏర్పాట్లు చేపట్టాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు.

## కొత్తపేట ప్రధాన కాల్వలో పూడిక తీత పనులు

కుప్పం, జూన్ 10 ప్రభాతవార్త




కుప్పం మున్సిపల్ పరిధి కొత్తపేటలో ఉన్న ప్రధాన కాలువలో గత పదిహేను ఏళ్లుగా పేరుకు పోయిన చెత్తచెదారాలు, పూడిక తీత పనులను మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు చేపట్టారు. కాలువలో పేరుకున్న వ్యర్థాలతో మురుగునీరు రోడ్లపై వస్తోందని ప్రజలనుంచి ఫిర్యాదులు రావడంతో ప్రధాన కాలువలో పూడికతీత పనులు చేపట్టినట్లు కమీషనర్ తెలిపారు. కాలువలో ఉన్న వ్యర్థాలు,మురుగునీరుతొలగించిసీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## వేపూరులో కెసి ఆస్పత్రిచే ఉచిత వైద్య శిబిరం

కుప్పంరూరల్, జూన్ 10 ప్రభాతవార్త




1.వైద్య శిబిరం దృశ్యం (కెపిఎంరూరల్ 1)

...మంలో కుప్పం కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఛైర్మన్ ...రం నిర్వహించారు. సుమారు 350మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు ...ల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ...ల్గొన్నారు.

## యథేచ్ఛగా చెరువు కట్ట కాలువ ఆక్రమణలు.. సిసి రోడ్డు ధ్వంసం

వి.కోట, జూన్ 10 ప్రభాతవార్త



పట్టణంలోని పత్రపల్లి చెరువునుంచి వి.కోట పెద్ద పెద్ద చెరువుకు మరువనీరు వెళ్తుంది. వీటి మధ్య వంద అడుగుల వెడల్పుతో కాలువ ఉంది. ఈకాలువ కట్టపై ప్రజలు రాకపోకలు కొనసాగించేందుకు సిమెంట్ రోడ్డును నిర్మించారు.ప్రస్తుతం ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం కట్ట కాలువ భూమిని ఆక్రమించంతో పాటు పిల్లర్లు వేసేందుకు సిమెంట్ రోడ్డును సైతం తవ్వేశాడు. ఈవిషయంగా పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని భారత్ నగర్ వాసులు వాపోయారు. దీంతో చేసేది లేక జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. చెరువు కట్ట ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రాభివృద్ధిపై విషం కక్కడం దారుణం

– మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, జూన్ 10 ప్రభాతవార్త

రాష్ట్ర అభివృద్ధిపై వైసిపి కాలనాగులు విషం కక్కడం దారుణమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల నీచమైన, అసమర్థ పాలన నుంచి రాష్ట్రం విముక్తి పొంది నేడు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు వేగంగా పురోగమిస్తోందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా సాగుతోందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయన్నారు. ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా వైసిపికి బుద్ధి రాలేదన్నారు. వైఎస్ జగన్ మీడియా అబద్ధాలే పరమావధిగా రాతలు రాస్తోందన్నారు. రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందని విషం కక్కడం దారుణమన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కొలతలుతీత

కుప్పం, జూన్ 10 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం ఆదేశాలతో స్థానిక 19,21 వార్డుల పరిధిలో ఉన్న శివాలయం, ఊరిగంగమ్మ ఆలయాల అభివృద్ధికి కౌన్సిలర్ జిమ్‌దాము నేతృత్వంలో కొలతలు తీశారు. ఒక్కో ఆలయాన్ని 25లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్, బాలాజీ, చంద్ర పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఉపాధిమస్టర్లలో కూలీల సంఖ్య ఎక్కువగా నమోదుచేస్తారా..?

### – సమావేశాలకు సంబంధిత అధికారులే రావాలి.. లేకుంటే రావొద్దు !!

కుప్పం, జూన్ 10 ప్రభాతవార్త



మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీలు తక్కువగా వచ్చినా వారి సంఖ్య ఎక్కువగా నమోదు చేస్తున్నారని సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం ఎంపిపి హెచ్ఎం అశ్విని మురుగేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపిటిసి చిన్నదొరై మాట్లాడుతూ ఉపాధిలో కూలీల సంఖ్యను మస్టర్లలో అధికంగా నమోదు చేస్తున్నారని ఈ విషయంగా చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై ఎపిఓ హరినాథ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తగు పరిశీలన చేసి అలాంటివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు పూల మొక్కల సాగుకు అవకాశం ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఇఓ మహబూబ్ బాషా మాట్లాడుతూ ఈనెల 12నుంచి ప్రభుత్వ పాఠశాలలు తెరచుకుంటాయన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఉచిత విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాగా మూడు నెలలకు ఓ సారి జరిగే సమావేశాలకు సంబంధిత శాఖల హెచ్ఓడిలు రావాలని కిందిస్థాయి వారితో అరకొర సమాచారం పంపవద్దని ఎంపిపి అశ్విని పేర్కొన్నారు. అలా చేయాలనుకుంటే సమావేశానికి రావద్దని సూచించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రజలు, రైతులకు రెస్కో అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుశీల, ఎంపిడిఓ విజయదత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మామిడి నాణ్యతను అగ్రికల్చర్ సిబ్బంది పరిశీలించాలి

పూతలపట్టు, జూన్ 10, ప్రభాతవార్త



ప్రభాతవార్త మండలంలో 8 ఫ్యాక్టరీలు ఉండగా మామిడి నాణ్యతను అగ్రికల్చర్ సిబ్బంది పరిశీలించిన తర్వాత పరిశ్రమలకు దిగుబడి చేరవేయాలని తాసిల్దార్ రమేష్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం 4 రూపాయలు సబ్సిడీ, రైతుల దగ్గర కొనుగోలు చేసే పారిశ్రామిక యాజమాన్యం 8 రూపాయలు రైతుకు ఇస్తున్నందున రైతు నాణ్యమైన మామిడి కాయలను పరిశ్రమలకు దిగుబడి చేరవేయాలని దీనిని పర్యవేక్షణ రైతు భరోసాలో ఉన్నటువంటి అగ్రికల్చర్ సిబ్బంది పర్యవేక్షించాలని రెండు నెలలు యావాది ఉన్నదన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఆ పత్రిక, ఛానెల్ బ్యాన్ చేయాలి

పుంగనూరు రూరల్, జూన్ 10, ప్రభాతవార్త



మహిళల పట్ల అసభ్యకరంగా ప్రసారం చేసిన సాక్షి ఛానల్ సాక్షి పేపర్‌ని బ్యాన్ చేయాలి మహిళలు డిమాండ్ చేశారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో మహిళలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఇందిరా కూడలి నుండి ఎంబీటీ రోడ్డు, అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగించారు. అమరావతి మహిళలకు వైయస్ భారతి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తహసిల్దార్ రాముకు వినతి పత్రం అందజేశారు.

## మాల మహానాడు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఎం.రామకృష్ణ

పుంగనూరు రూరల్, జూన్ 10 ప్రభాతవార్త

మండలంలోని నక్కబండకు చెందిన ఎం.రామకృష్ణను ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. మంగళవారం పుంగనూరు అంబేద్కర్ భవనంలో సంఘ నాయకులు మాల మహానాడు కార్యదర్శి ఎన్.ఆర్.అశోక్ సత్కరించారు. అభినందనలు తెలియజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## 14న కాణిపాకంలో సంకటహార గణపతివ్రతం

కాణిపాకం, జూన్ 10 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఈనెల 14న సంకటహార గణపతివ్రతంను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ప్రతినెలా పౌర్ణమి అనంతరం వచ్చే చతుర్థి రోజున ఈవ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఈనెల 14న ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు జరిగే ఈవ్రతంలో భక్తులు 350 రూపాయలు టిక్కెట్ చెల్లించి గోత్రనామాలతో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.అలాగే రాత్రి7 గంటల నుండి 8 గంటల వరకు స్వామివారికి స్వర్ణరథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు.

## కాణిపాకంలో ఘనంగా బాలకృష్ణ జన్మదినవేడుకలు

కాణిపాకం, జూన్ 10 ప్రభాతవార్త:



ప్రముఖ సినీ హీరో,హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం కాణిపాకంలో చిత్తూరు బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఎల్‌బి.నాయుడు ఆధ్వర్యంలో బాలకృష్ణ, ఎన్టీఆర్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్ర మానికి పూతలపట్లు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ఉదయం ఆలయంలో బాలకృష్ణ పేరిట స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా స్థానిక అగరంపల్లె కూడలి వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే మురళీమోహన్ కట్ చేశారు.అనంతరం పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈకార్యక్రమంలో జిల్లా బాలకృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడు నరసింహులునాయుడు, చిత్తూరు టౌన్ అధ్యక్షుడు ఎల్‌బి.నాయుడు, ప్రణిత్ చౌదరి, కిరణ్ చౌదరి,మురళీనాయుడు, వంశీ చౌదరి, భార్గవ్ చౌదరి, పవన్‌కుమార్, సాధు, దిలీప్, యువకృష్ణ, యశ్వంత్,ఐరాల మండల టీడీపీ అధ్యక్షుడు హరిబాబునాయుడు, మాజీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, నాయకులు పూర్ణచంద్రరావులతో పాటు పలువురు ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

## పూతలపట్టు నియోజకవర్గ సమస్యలపై సీఎంకు వినతి

తవణంపల్లె, జూన్ 10 ప్రభాతవార్త:



పూతలపట్టు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సప్తగిరి ప్రసాద్ వినతి పత్రం అందజేశారు. ఈమేరకు కాణిపాకం దేవస్థానంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్‌లో ఏళ్ల తరబడి అత్యంత తక్కువ జీతంతో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు పెంచాలని, 10 సంవత్సరాలు సర్వీస్ వున్న వారికి మినిమమ్ టై స్కేల్ ఇవ్వాలని కోరారు. అలాగే బంగారుపాళ్యం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేసి అదనంగా మో 10 డయాలసిస్ యంత్రాలను పెట్టి కిడ్నీ రోగులను ఆదుకోవాలని, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో న్యూరాలజీ, కార్డియాలజి విభాగాలను ఏర్పాటు చేసి నూతన వైద్యులను నియమించి వైద్యశాలను అభివృద్ధి చేయాలని కోరుతూ సీఎంను సచివాలయంలో సీఎం చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేసినట్లు సప్తగిరి ప్రసాద్ తెలిపారు.

## గ్రామాల్లో బాలయ్య జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 10 ప్రభాతవార్త



సినీ నటులు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకల సందర్భంగా మండల నాయకుడు రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి ఏర్పేడు మండలంలోని బండారుపల్లి, ఏర్పేడు లలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి అభిమా నులకు పంచి పెట్టారు. బాలయ్య అభిమానిగా ఉన్న గురువారెడ్డి సామాజిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమాల్లో మండల మాజీ అధ్యక్షుడు పొన్నారావు, సుబ్రమణ్యం యాదవ్, శివశంకర్‌రెడ్డి, నాదముని శెట్టి,శంకర్‌రెడ్డి, ధనంజయులు రెడ్డి, దామోదర్‌రెడ్డి,గురవయ్యయాదవ్, వినోద్,వెంకటేష్, మురళి,సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు

## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

తొట్టంబేడు,జూన్ 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మం డలం కన్నలి బ్రదర్స్ సారథ్యంలో క్రికెట్ టోర్న మెంట్ నిర్వహించారు. సుమారు 15 రోజుల పాటు జరిగిన టోర్నమెంట్ పోటీల్లో విన్నర్ గా కల్లిపూడి జట్టు, రన్నర్ అప్స్‌గా కన్నలి దళితవాడకు చెందిన జట్టు నిలిచింది. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కన్నలికి చెందిన ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి సారథ్యంలో జరిగిన పోటీల్లో పది జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విన్నర్స్‌కు 10వేల నగదు బహుమతితో పాటు ట్రోఫి అందిం చారు.రన్నర్స్ కన్నలిదళితవాడకు చెందిన టీంకు రూ.5వేల నగదు బహుమతితో పాటు ట్రోఫిని అందించారు.

## ఇద్దరు చైను దొంగలు అరెస్టు

శ్రీకాళహస్తి,జూన్ 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పరిసరాల్లో మహిళలు మెడలోంచి బంగారు నగలు లాక్కోటం మోటార్‌సైకిళ్ళ దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ నాగార్జున్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇద్దరు యువకులు గంజాయి, మద్యంకు అలవాటు పడి పబ్బం గడుపుటకు చోరీలకు అలవాటు పడ్డారు. వీరిలో ఒకరిపై తిరుపతి యూనివర్శిటి కాంపస్‌లో మోటార్ సైకిళ్ళు, టూటౌన్ పరిధిలో కూడా కేసులు నమోదు అయినట్లు వివరించారు. అరెస్టు చేసిన వారిలో తిరుపతి ఎంఆర్‌పల్లికి చెందిన షేక్ అల్తాఫ్ మెకానిక్‌గా పని చేస్తూ చెడు అలవాట్లకు అలవాటై చోరీలకు పాల్పడుతున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. శ్రీకాళహస్తి మండలం నారాయణ పురానికి చెందిన టి.దుర్గా ప్రసాద్(20) మద్యపానానికి గంజాయికి అలవాటు పడ్డాడు. ఒంటరి మహిళలు మెడలో నగలను బైక్‌లపై వచ్చి లాక్కోవటం ప్రతి నిత్యంగా మార్చుకున్నారు. వారిని అరెస్టు చేసి వారి నుంచి రెండు మోటార్ సైకిళ్ళు, మూడు బంగారు చైన్లను స్వాదీనం చేసుకున్నట్లు వివరించారు. వీరిని జిల్లా ఎస్పి అభినందించారు. రుపాల్, జయశంకర్, మునిచంద్రారెడ్డి, రామ్మూర్తి, కల్లుపల్లి శశిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టాటా ఆల్ట్రోజ్ మార్కెట్ లోకి విడుదల

తిరుపతి విద్య జూన్ 10 ప్రభాత వార్త




టాటా మోటార్స్ ఆ ద. ౕ వ ం య ం ల రూపొందిం చిన సరి కొత్త ఆల్ట్రోజ్ వెహికల్‌ని తిరుపతి ఆర్టీవో మురళీ మోహన్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక కాటన్ మిల్ వద్ద విజయ భారతి టాటా మోటార్స్ రెండవ ఆ బ్రాంచ్ ను మంగళ వారం ప్రారంభించారు.బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా నూతన వాహనాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ వాహనం పెట్రోల్,డీజిల్, సిఎన్జి,మూడు ఇంజిన్లతో,ఏఎంటీ, డిసిఏ,ఎం.పి ట్రాన్స్మిషన్లు అందుబాటులో ఉందన్నారు.స్మార్ట్, ప్యూర్,క్రెటివ్,ఆకాంప్లీస్ తో ఐదు ఆకర్షమేనా రంగుల్లో కారు రూపొందించబడిందన్నారు.ఇండియన్ కార్ మార్కెట్ లో హ్యాచ్ బ్యాక్ డీజల్ తో ఆల్ట్రోజ్ మాత్రమే అందుబాటులో ఉందన్నారు.స్టైలిష్ లుక్, పవర్,టెక్నాలజీ గల ఆల్ట్రోజ్ ఫైవ్ స్టార్ సేఫ్టీ రేటింగ్ తో అత్యుత్తమ కారుగా నిలిచిందన్నారు. రూ. 6.89 లక్షల ధర నుండి అందుబాటులో ఉందన్నారు. దీనిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఎండి వెంకటరామ్ సభాపతి,జోనల్ హెడ్ జయదీప్,రీజినల్ మేనేజర్ గోపికృష్ణ, కెరటజీ మేనేజర్ గౌతమి, ఆ సమస్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ కోచింగ్ కంప్యూటర్ శిక్షణ

శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని మీ సేవ కేంద్రంలో సమ్మర్‌కోచింగ్ ఒరెండవ బ్యాచ్‌ను ప్రారంభించుటకు సన్నాహాలు జరుగుతున్నాయని నిర్వాహకులు సూర్యకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ప్రతి అంశానికి కంప్యూటర్ పరిజ్ఞానం కోరుతున్నారని కాబట్టి చదువుకున్న వారితో పాటు డ్రాప్ అవుట్స్ కూడా కంప్యూటర్ నేర్చుకోవచ్చునని వివరించారు. 15రోజుల్లో ఫండమెంటల్ కంప్యూటర్ శిక్షణ ఉంటుందన్నారు. అలాగే వెబ్‌డిజైన్‌కు 15రోజులు పడుతుందని వివరించారు. అతి తక్కువ ఫీజుతో ఈ శిక్షణను నిరుద్యోగ యువతి యువకుల కోసం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కేవలం డిగ్రీలు పొందటమే కాకుండా నేడు ఏ పోటీ పరిక్షలు రాయాలన్నా ఉదాహరణకు ఎంసెట్, ఈ సెట్, పోలి సెట్, జేఈ మెయిన్స్ లేదా ఏ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కోరుతున్నారని ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా నందమూరి జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త



నందమూరి యువ కిసోరం నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తిలో అభిమానులు, తెలుగుదేశం కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బాలకృష్ణజన్మదిన సందర్భంగా కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ సినిమా పరిశ్రమలోనే కాదు రాజకీయంలో కూడా తిరుగులేని నాయకుడుగా రాణిస్తున్నారన్నారు. తన నియోకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి అభిమానులు, తెలుగుదేశం నాయకులకు తినిపించారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు, రావిళ్ళ మునిరాజానాయుడు, నాగరాజు నాయుడు, ఆర్ముగం, సుబ్బయ్య కిట్టు, కంఠారమేష్, రేణుకమ్మ, మల్లీశ్వరమ్మ, సుమతి, దొరైవేలు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సిఎంకు వ్యతిరేకంగా మహిళల ప్రదర్శనలు

శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మహిళలపట్ల వ్యాఖ్యలు దారుణమని శ్రీకాళహస్తికి చెందిన మహిళలు ఆయనకు వ్యతిరేకంగా పట్టణంలో ప్రదర్శనలు జరిపారు. ప్రదర్శనలు బేరివారి మండపం నుంచి పెండ్లి మండపం వరకు సాగింది. ఈ సందర్భంగా మహిళలు జగన్ ఫోటోను దగ్ధం చేసారు. అమరావతి రాజధాని వేశ్యల నిలయం అంటూ వ్యాఖ్యానించటం గమనించదగ్గ విషయం. మహిళల పట్ల ఆయన తీరుకు నిదర్శనం అంటూ నినాదాలు చేసారు. ఆది నుంచి జగన్మోహన్‌రెడ్డి మహిళా వ్యతిరేకి అన్నారు. తల్లిని చెల్లిని వ్యతిరేకంగా నినాదాలు చేసారు.

## గాయపడ్డ బాధితుని పరామర్శించిన నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాయిని మంగళవారం నాయకులు పరామర్శించారు. ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడ్డ వరదయ్యపాళెం పంచాయతీ చెన్నావారి పాళెం దళితవాడకు చెందిన దగ్గోలు సాయి గాయపడ్డారు. ఆతన్ని చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. మంగళవారం రాష్ట్ర చేనేత విభాగం ప్రధానకార్యదర్శి బొప్పన తిలక్ బాబు సాయి తండ్రి చెంగయ్యను కలిసి ఆరోగ్యపరిస్థితిపై చర్చించారు. సాయి కుడి చేయికి శస్త్ర చికిత్స జరిపారని కుడికాలుకు బుధవారం శస్త్ర చికిత్స జరపనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు కిన్నెర ఉమామహేష్, పివి రమేష్, లారీ అసోసియేషన్ అధ్యక్షులు సూర్య ప్రకాష్ చౌదరి తదితరులు ఉన్నారు.

## నందమూరి జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి సారథ్యంలో మంగళవారం శ్రీకాళ హస్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు పండ్లు, రొట్టెలను అందించారు. హిందూపూర్ శాసనసభ్యుడు సినీ నటులు నందమూరి బాలకృష్ణ జన్మ దినం సందర్భంగా సామాజిక కార్యక్ర మాలను నిర్వహించారు. ఆయన తోపాటు మండల పార్టీ అధ్యక్షులు పొన్నారావు, నియోజకవర్గ పార్టీ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, సీనియర్‌నాయకులు నాగేశ్వరరావు, పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్ మండల బిసి నాయకుడు మునెయ్య, రమణ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## బాలకార్మికుల వ్యవస్థ వ్యతిరేక పోస్టర్లు ఆవిష్కరణ

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 10 ప్రభాతవార్త



బాలకార్మికుల వ్యవస్థ వ్యతిరేకపోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ప్రగతి సంస్థ సారథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రోచైల్డ్ గ్రూప్ మరియు చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫోరం సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఏర్పేడు సిఐ శ్రీకాంత్ ఎస్ఐ శ్రీకాంత్‌ల ముఖ్యఅతిథులుగా కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. సమాజంలో చదువుకునే వయస్సులో చిన్నారులను పనుల్లో ఉపయోగించుకుంటే వారి భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారుతుందని వివరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బాలకార్మికుల వ్యవస్థను నిర్మూలించటంలో ప్రగతి సంస్థ చొరవ అభినందనీయం అన్నారు. సంస్థ కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ బాలల భవిష్యత్తులోనే దేశ ప్రగతి దాగి ఉందన్నారు. వారి బంగారు బాల్యాన్ని కాపాడడం కోసం తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ నెల 12 అంతర్జాతీయ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరణ ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమాల్లో మురుగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 11 మంది విద్యార్థులకు జాతీయ ఉపకారవేతనాలు

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. 2024 సంవత్సరం కేంద్ర ప్రభుత్వం చే నిర్వహించబడిన జాతీయ ఉపకారవేతన పరీక్ష నందు ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులు మండలం లో ప్రథమ స్థానంలో నిలిచి రికార్డు సృష్టించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు. మండలంలో నుంచి అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు కానీ మండలంలో అత్యధిక మంది విద్యార్థులు ఎంపికైన పాఠశాల ఊరందూరు ఒక్కటే అని వివరించారు. వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు సహకరించిన తల్లిదండ్రులకు ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి అభినందించారు. ఎంపికైనవిద్యార్థులకునాలుగు సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వంచే 15 వేల రూపాయలు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందుతాయని వివరించారు.

## లోపాలను సరిదిద్దుకోండి: మళ్ళీ దరఖాస్తు చేసుకోండి

శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో భవనాలు నిర్మించుకునే యజమానులు అనుమతుల కోసం గతంలో దరఖాస్తులు చేసుకున్నారు. అలా దరఖాస్తు చేసుకొని పలు లోపాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు518 ఉన్నట్లు ఫుల్ అడిషనల్ చార్జి కమిషనర్ సంజీవ్ మంగళవారం తెలిపారు. ఇది వరకు భవన అనుమతుల కోసం ఎపిడిపిఎంఎస్ ద్వారా అన్‌లైన్లో దరఖాస్తులు చేసుకున్న వారి దరఖాస్తుల్లో లోపాలున్నాయని వాటిని సరిదిద్దుకొనుటకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. వాటిని సవరించి అనుమతి పొందుటకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ పిలుపు నిచ్చారు. సవరించుకొనుటకు భవన యజమానులు రిజిష్టర్ డాక్యుమెంట్లు, భవన నిర్మాన ప్లాన్ భవన నిర్మాణ సెట్ బాక్సుకు సంబంధించి సమర్పించాలని సూచించారు. ఒకవేళ బిల్డింగ్ లైసెన్సు ఫీజులు చెల్లించక ఉంటే లైసెన్సుడ్ టెక్నికల పర్సన్స్‌ను సంప్రదించి పరిష్కారం పొందాలని కమిషనర్ సంజీవ్ సూచించారు.

## వైభవంగా సప్తగిరి నగర్‌లో జాతర వేడుకలు

చంద్రగిరి, జూన్ 10 ప్రభాతవార్త:



స్థానిక సప్తగిరి నగర్ (జోగల కాలనీ)లో మంగళ వారం జాతర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వ హించారు. ఇందులో భాగంగా నడివీధి గంగమ్మ వారి ని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో విశేష అలంకరణలు గావించారు. మహిళలు మంగళకరంగా తయారై అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కాలనీలో బంధుమిత్రుల రాకతో పండగ వాతావరణంలో జాతర వేడుకలు వైభవంగా జరుపుకున్నార

## పిల్లలను పనుల్లో చేర్చుకోవడం నేరం...

..రేణిగుంట జూన్ 10 ప్రభాత వార్త



చదువుకోవాల్సి న పిల్లలను పనుల్లో చేర్పించడం, చేర్చుకోవడం నేరమని రేణిగుంట మండల విద్యాశాఖ అధికారి ఇందిరా దేవి హెచ్చరించారు. రేణిగుంట ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ క్లోజ్ చైల్డ్ గ్రూప్ చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫోరం సహకారంతో బాల కార్మికుల వ్యవస్థకు వ్యతిరేకంగా గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇందిరా దేవి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడుల్లో ఉండాలి కానీ పనుల్లో ఉండకూడదన్నారు. ప్రభుత్వం పిల్లలు చదువుకోవడానికి ఎన్నో సౌకర్యాలు కల్పించడంతోపాటు పుస్తకాలు యూనిఫామ్ మధ్యాహ్న భోజనం తదితర ప్రత్యేక వసతులను ఏర్పాటు చేస్తున్నది అన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను బడులకు పంపాలన్నారు. బడి పిల్లల ఉద్ధరణ కోసం కృషి చేస్తున్న ప్రగతి సంస్థను అభినందించారు. బాల్యవివాహాలు నిరోధించడం కోసం ప్రగతి సంస్థ చేపట్టిన అనేక కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ప్రగతి ప్రాజెక్ట్ ఆఫీసర్ నారాయణ, మండల కోఆర్డినేటర్లు జయలక్ష్మి, శిరీష, సుభాన్, చంద్రయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు..

## తొలగించిన స్టీల్ ప్లాంట్ ఉద్యోగులను వెంటనే విధుల్లో చేర్చుకోవాలి....



రేణిగుంట జూన్ 10 ప్రభాతవార్త వైజాగ్ స్టీల్ ప్లాంట్ నందు తొలగించిన 3,000 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిపిఎం పార్టీ నేతలు డిమాండ్ చేశారు. రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం నేతలు స్టీల్ ప్లాంట్ ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడానికి నిరసనగా మంగళవారం ధర్నా చేశారు. స్టీల్ కర్మాగారంలో 5400 మంది విధులు నిర్వహిస్తుండగా హఠాత్తుగా 3000 మంది కార్మికులను విధులు నుండి తొలగించడానికి సిపిఎం అనుబంధ సిఐటియు యూనియన్ తీవ్రంగా ఖండించింది. వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సిఐటియు అధ్యక్షులు సెల్వరాజ్, హరినాథ్, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వెంకటరమణ, రాజ శేఖర్, దిలీప్‌భాష, కుప్పుస్వామి, చీరాలయ్య, దస్తగిరి, ఈశ్వరమ్మ, భారతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకుడదు.



– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి విద్య జూన్ 10 ప్రభాత వార్త

పద్మవిభూషణ్ నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా సంజయ్ గాంధీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యా సామాగ్రిని విద్యార్థులకు మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ విద్యాసామాగ్రిని ఏర్పాటు చేశారు. నందమూరి బాలకృష్ణ ఇలాంటి పుట్టిన రోజులను మరిన్ని చేసుకుని కళారంగానికి సేవతో పాటు రాజకీయ, సేవరంగాల్లోనూ మరింతగా రాణించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆకాంక్షించారు. స్కూల్స్ తెరిచిన వెంటనే ఆరవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు తదితరాలను ఉచితంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందిస్తుందని ఆయన చెప్పారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకుడదని తల్లికి వందనం పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు తీసుకొచ్చారని ఆయన తెలిపారు. స్కూల్స్ తెరిచిన వెంటనే తల్లికి వందన పథకం కింద విద్యార్థుల తల్లి ఖాతాలో 15వేల రూపాయలను జమ చేస్తుందని ఆయన చెప్పారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పడంలో టీచర్స్ తోపాటు తల్లితండ్రులు బాధ్యతతో వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ ఫ్యాన్స్ అసోషియేషన్ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, టిడిపి నగర ప్రధానకార్యదర్శి మహేష్ యాదవ్, రూపేష్, కేపి చౌదిరి, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ సంక్షేమ పథకం అమలు చేయాలి

– సీపీఎం డిమాండ్

పుత్తూరు రూరల్, జూన్ 10 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ సభ్యులు సమావేశం కేఆర్ సుబ్రహ్మణ్యంపిళ్లై అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్థన్ పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తరువాత పెన్షన్ తప్ప ఏమి సంక్షేమ పథకాల అమలు చేయలేదని ఆరోపించారు. జూలై 9న జరిగే దేశవ్యాప్తంగాసార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, విజయ్, రమేష్, యాసిన్ బాషా, దేవారెడ్డి, మునిశంకర్, శివ, శివకుమార్ పాల్గొన్నారు.

## కిషోర బాలికల వికాసంపై వేసవిశిక్షణ కార్యక్రమం ముగింపు

విజయపురం, జూన్ 10 ప్రభాతవార్త:



గత నెల రోజులుగా ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కిషోర బాలికల వికాసంపై వేసవి శిక్షణ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని జగన్నాథపురం, మహావీరాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో కిషోర బాల బాలికల వికాసంపై అక్కడి తల్లిదండ్రులకు కిషోర బాల బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వరకు ఉన్న బాల బాలికలు విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత, ఇతర విషయాలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆయా పరిధిలోని తల్లిదండ్రులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

## ఐసర్‌లో అగ్నిప్రమాదం

శ్రీకాళహస్తి రూరల్, జూన్ 10 ప్రభాతవార్త



ఏర్పేడు సమీపంలోని జంగాల పల్లి వద్ద నిర్వహిస్తున్న ఐసర్ విద్యాసంస్థలో మంగళవారంమధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ మేరకు ఐసర్ డైరెక్టర్ సంతాన భట్టాచార్య ప్రకటన విడుదల చేసారు. విద్యార్థులు ప్రయోగాలు చేసే సమయంలో ప్రమాద వశాత్తు ద్రావనాలు జారి పడటంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. అయితే ప్రమాదం జరిగన వెంటనే శ్రీకాళహస్తి, వెంకటగిరికి చెందిన అగ్నిమాపక శాఖ అధికారులు పరుగులు తీసారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రమాదంలో చిన్న చిన్న ఆస్తి నష్టం జరిగి నట్లు పేర్కొన్నారు. ఐసర్ భవనంలోని నాల్గవ అంతస్థులోని కెమిస్ట్రి ల్యాబ్‌లో విద్యార్థులు ప్రయోగాలు చేసే సమయంలో ప్రమాదం జరిగినట్లు ద్రావణాలు పడటంతో మంటలు చెలరేగినట్లు వివరించారు.

## సామాన్యుల వివాహాలకు కళ్యాణ మండపాలు నిర్మించాలి!

శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పరిసరాల్లో సామాన్యులు, మధ్యతరగతి వారి కోసం కళ్యాణ మండపాలను దేవస్థానం నిర్మించాలని మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు అత్తింజేరి బాలాజి డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డికి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. శ్రీకాళహస్తిలో సామాన్యులు కళ్యాణాలు, శుభకార్యాలు జరిపించుకొనుటకు ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆయన వివరించారు. శ్రీకాళహస్తి లోని మండపాల్లో అద్దెలు ఆకాశానంటుతున్నాయన్నారు. గతంలో సామాన్యునికి అందుబాటులో టిటిడి కళ్యాణమండపాలు, శ్రీకాళహస్తీశ్వరాలయం దేవస్థానం సారథ్యంలో ప్రసన్న వరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో కళ్యాణమండపాలు అందుబాటులో ఉండేదన్నారు. నేడు సామాన్యులకు అందుబాటులో కళ్యాణ మండపాల్లేదు. ఏ కళ్యాణ మండపం రూ.1.3లక్షలకు తక్కువ లేదు. అక్కడే డెకరేషన్, షామియానాలు, క్యాటరింగ్‌లు తీసుకోవాలి. కళ్యాణ మండపాల అద్దెలతో పాటు కరెంటు చార్జీలు చెల్లించుకోవాల్సి వస్తుందని వివరించారు. గతంలో శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో కళ్యాణ మండపాలు ఉండేది వాటిటిని పడగొట్టారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి విన్నూత్న విధానాలతో ప్రణాళికలు నిరుపేదలకు అవకాశం కల్పిస్తున్నారు. అన్ని వర్గాలను ఆకట్టుకుంటూ ముందుకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో సామాన్యులకు కులాలు మతాలతో సంబంధం లేకుండా కార్యక్రమాలు జరిపించుకొనుటకు కనీసం 200 మందికి సరిపడేటట్లు కనీస సదుపాయాలతో నిర్మించాలని కోరారు. అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి పట్టణం, రూరల్, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో ప్రజలకు అందుబాటులోకి కళ్యాణ మండపాలు దేవస్థానం నిర్మించి సామాన్యులకు అందుబాటులో తీసుకురావాలని అత్తింజేరి బాలాజి వినతి పత్రం అందించారు.

# తిరుపతి డివిజన్

## వైభవంగా ముగిసిన నాల్గవ ఉత్కర్ష సమారోహం



తిరుపతి విద్య, జూన్ 10 ప్రభాతవార్త

మహారాష్ట్రలోని నాసిక్ ప్రదేశంలో కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాల్గవ ఉత్కర్ష మహోత్సవ కార్యక్రమం మంగళ వారం ముగింపు కార్యక్రమం వైభవోపేతంగా జరిగినది. ఈ సందర్భంగా కులపతుల సంవాదము అనే చర్చాగోష్టిని ఈ ఉత్కర్ష సమారోహ కార్యక్రమంలో భాగంగా నిర్వహించడం జరిగినది. అందులో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ.జిఎస్ఆర్ కృష్ణమూర్తి ప్రసంగిస్తూ సంస్కృత శాస్త్ర జ్ఞానాన్ని ఉత్కర్ష సమారోహం ద్వారా విద్వాంసలందరూ ఎంతో వైభవోపేతంగా చర్చించడం జరిగినది. ఆధునిక సమాజానికి సంస్కృత జ్ఞానమే దిక్సూచి అనే అంశాన్ని విశదీకరించడం జరిగినది. సంస్కృతంలో ఏఐ అనే అంశాలను, సంస్కృతం ద్వారా భావితరాల భవిష్యత్తు అనే అంశాలను కూడా ఈ సందర్భంగా చర్చించడం జరిగినది. ఐదవ ఉత్కర్ష మహోత్సవం తిరుపతిలోని జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా కులపతులు ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి సభాముఖంగా తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.

## డిగ్రీ సప్లమెంటరీ ఫలితాలు విడుదల

తిరుపతి విద్య, జూన్ 10 ప్రభాతవార్త

ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్లో జరిగిన డిగ్రీ సప్లమెంటరీ 6వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ప్రొఫెసర్ కే సురేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్సైట్ ను పరిశీలించాలని సూచించారు.

## 13 న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి విద్య, జూన్ 10 ప్రభాతవార్త

ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 13 వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ ఎస్ సి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డీఫార్మసీ, బీ ఫార్మసీ, ఎమ్ ఫార్మసీ, ఏదేని డిగ్రీ అర్హత గల అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. మూడు పేరొందిన ఎమ్ఎన్సీ కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళా కు హాజరువుతారని పేర్కొన్నారు. మరిన్నివివరాలకోసం9533889902,7989810194నంబర్లనందుసంప్రదించాలనిసూచించా రు

## ఘనంగా జగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి జయంతి

తిరుపతి విద్య, జూన్ 10 ప్రభాత వార్త



జగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి 132వ జయంతి సందర్భంగా నగరంలో శోభా యాత్ర జరిగింది. కపిలతీర్థం నుంచి మొదలైన శోభాయాత్ర కంచిమఠం వరకు సాగింది. ఈ యాత్రలో కంచి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి , సత్య చంద్రశేఖర శంకరాచార్యులు పాల్గొన్నారు. అలాగే ఈ యాత్రలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన సతీమణి సత్యవతి తో కలిసి పాల్గొన్నారు. వీరిని శంకర విజయేంద్ర సరస్వతి ఆశ్వీరదించారు.

## సహకరించండి .. న్యాయం చేస్తాను..!

ఎంఎల్ఏ పులివర్తి నాని ,ఐతేపల్లి-ఏ.రంగంపేట రోడ్డు పనులు షురూ



***చంద్రగిరి, జూన్ 10 ప్రభాతవార్త:*** గత ప్రభుత్వ స్వార్థపూరిత రాజకీయాల కోసం రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదని ప్రజలు సహకరిస్తే తప్పక న్యాయం చేస్తానని ఎంఎల్ఏ పులివర్తి నాని హామీ ఇచ్చారు. ఐతేపల్లి - జాతీయ రహదారి నుండి ఆరేపల్లి రంగంపేట జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ చేపట్టిన విస్తరణ పనులను మంగళవారం ఎంఎల్ఏ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ రోడ్డు విస్తరణ ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందగలదన్నారు. ముఖ్యంగా భూములు, ఆస్తుల విలువ ఘననీయంగా పెరుగుతాయన్నారు. ఇల్లు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేస్తానన్నారు. అంతకుముందు టిడిపి నాయకుడు, క్లాస్ 1 కాంట్రాక్టర్ ఏ.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు ఎంఎల్ఏకి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, చంద్రగిరి మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, ఎంపిటిసి ఏసి శేఖర్, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, ఏజి పల్లి బాల, ఉస్మాన్, లోకాద్రి నాయుడు, కన్నయ్య నాయుడు, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఈఓఆర్‌డివెంకటరత్నం, విఆర్ఓవిజయ్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పనపాకం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

చంద్రగిరి, జూన్ 10 ప్రభాతవార్త:



పనపాకం వద్ద జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుకు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వెలుగుచూసింది. గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సబ్సిడీపై వేరుశెనగ విత్తనాలు పంపిణీ

రైతు సంఘాలకు ఆధునిక సాంకేతికతతో డ్రోన్లు ,ఎంఎల్ఏ పులివర్తి నాని

చంద్రగిరి, జూన్ 10 ప్రభాతవార్త:





రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రెండవ విడత సబ్సిడీపై వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని తెలిపారు. మండల పరిధిలోని నారావారిపల్లిలో మంగళవారం ఆయన రైతులకు సబ్సిడీ వేరుశెనగ విత్తనాలు, రైతు సంఘాలకు డ్రోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతను అందిపుచ్చుకుని పంటసాగులో మందులు పిచికారి చేయడానికి డ్రోన్లు తయారు చేసినట్లు వివరించారు. రైతుల ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండవ దఫా విత్తనాలు పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చంద్రగిరి మండలానికి ప్రభుత్వం 502 క్వింటాళ్ళు మంజూరు చేసినట్లు తెలిపారు. 30 కేజీలు విత్తనాలు రూ.2790/-లు కాగా రూ.1116/-లు సబ్సిడీతో రూ.1674/-లకు రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా యాంత్రీకరణ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న 15 మంది రైతులకు వ్యవసాయ పనిముట్లుమంజూరు చేసినట్లు తెలిపారు వ్యవసాయశాఖ అధికారులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పేద మధ్యతరగతి ప్రజల కోసమే తుడా...

చైర్మన్ దివాకర్ రెడ్డి..



రేణిగుంట జూన్ 10 ప్రభాతవార్త పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమ కోసమే తుడా (తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీస్) పనిచేస్తుందని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం సూరప్ప కసం పద్మావతి నగర్ తుడా లేఅవుట్ ను అధికారులతో కలిసి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. లేఔట్ లో ఇంకా 270 ప్లాట్లు అమ్మకానికి ఉన్నట్లు గుర్తించారు. పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి అనువైన ధరలకు ప్లాట్లు విక్రయించడానికి చర్యలు చేపడతామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. లేఅవుట్ ప్లానింగ్ను తుడా అధికారులు దివాకర్ రెడ్డికి వివరించారు. కమర్షియల్ రెసిడెన్షియల్ తదితర ప్లాట్లను మ్యాపింగ్ ద్వారా పరిశీలించారు. జంగిల్ క్లియరెన్స్ చేసి త్వరలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తుడా కార్యదర్శి శ్రీకాంత్, ఎస్ఈ కృష్ణారెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ దేవి కుమారి, జాయింట్ ప్లానింగ్ ఆఫీసర్ వాసుదేవ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్రయ్య, డివిజనల్ ఇంజనీర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు...

## మహిళ ఆత్మహత్య



శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని చెంచులక్ష్మీకాలనీకి చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కాలనీకి చెందిన సుమలత అనే ఉష (40) ధ్వాక్రా గ్రూప్‌లో సభ్యురాలుగా ఉంటూ రుణాలు చేసేది తిరిగి చెల్లించేది. మంగళవారం రూ.20వేలు ధ్వాక్రా సంఘానికి చెల్లించాల్సి ఉంది. సొమ్ములు చేతికందక పోవటంతో అవమానం జరుగుతుందని మానసికంగా డిస్టర్బ్ అయ్యి పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు కాలనీ వాసులు గమనించి ఆసుపత్రికి తరలించారు. ఆమెకు వైద్యులు వైద్యసదుపాయాలు అందిస్తున్నారు.

# బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది



ఓజిలి, జూన్ 10 ప్రభాతవార్త: బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్ కోసమే కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని ఐసిడిసి సూపర్‌వైజర్ సుజన తెలియజేశారు. సిడిపిఓ ఉమామహేశ్వరి ఆదేశాల మేరకు ఓజిలి మండలం కొండవల్లిపాడు పంచాయతీ పరిధిలోని ఆచార్లపార్లపల్లి గ్రామంలోని అంగనవాడి కేంద్రం వద్ద కిశోరి వికాసం, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు వాటి నివారణ అంగన్ వాడి బడిబాట పిల్లల అభివృద్ధికి పూలబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులతో పాటు భాధ్యతలను కూడా పిల్లలకు తెలియ జేయాలన్నారు. బాల్యం నుంచి యుక్త వయసు వరకు ఎవరి నుంచీ మోసపోకుండా కిశోర బాలికలకు అవగాహన కలిగి ఉండాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ఎంపొందించుకొనేందుకు ప్రత్యేక అవగాహనకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా పోలీస్ భారతి, కార్యకర్త ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని ఎంపీడీవో తనిఖీ

వాకాడు, జూన్ 10 ప్రభాతవార్త: వాకాడు మండలం దుగ్గరాజ పట్నం సచివాలయాన్ని మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తనిఖీ చేయడం జరిగినది, సచివాలయం సిబ్బంది యొక్క రిజిస్టర్లు రికార్డులు తనిఖీ చేశారు. ప్రతిరోజు విధిగా హాజరు వేయవలసిందిగా ఆదేశించారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నటువంటి యోగాంధ్రా కార్యక్రమములో జరుగుతున్న సర్వేలను త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా ఆదేశించారు. సచివాలయ పరిధిలోని ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటూ వాటిని పరిష్కరించే విధంగా చేయాలని కాని పక్షంలో తమ వద్దకు తీసుకురావాలని చెప్పడం జరిగినది. జిల్లా పరిషత్ ఆస్తులైనటువంటి పిడబ్ల్యూడి భవనాన్ని దాని యొక్క పరిసరాలని సందర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయ సర్వేయర్ కోదండ, డిజిటల్ అసిస్టెంట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

## మహిళలను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి : ఎంపీపీ



వెంకటగిరి, జూన్ 10 ప్రభాతవార్త: అమరావతి, మహిళలకు గురించి అసభ్యకరంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటగిరి మండల పరిషత్ అధ్యక్షురాలు తమ్మిరెడ్డి తనుజారెడ్డి తెలిపారు. అమరావతి మహిళల గురించి కించపరిచే విధంగా మాట్లాడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని వెంకటగిరి పట్టణ పురవీధుల్లో మహిళలు నిరసన ర్యాలీ చేశారు. అమరావతి దేవతలు సంచరించిన ప్రదేశంగా పెద్దలు చెబుతారని తెలిపారు. ఇలాంటి అమరావతిని వేశ్యలు ఉన్న ప్రదేశంగా చిత్రీకరించి మాట్లాడటం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, టిడిపి మహిళా నేతల కౌసల్యమ్మ, జనసేన నాయకులు జంపాల ప్రకాష్, రాధమ్మ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు ఆప్యాయతగా మెలగాలి : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూన్ 10 ప్రభాతవార్త : బాలికల పట్ల తల్లిదండ్రులు ఆప్యాయంగా చూడాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. కిశోర బాలికల వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా వెంకటగిరిలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మగ పిల్లలతో పాటే బాలికలను కూడా బాగా చదివించాలని సూచించారు. బాలికలను చిన్నచూపు చూస్తే వారి మనసు నొచ్చుకుంటుందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు బాలికల అభ్యున్నతకే ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. శిశు సంక్షేమ శాఖ పిడి వసంత భాయ్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపివో శంషాద్ బేగం, సిఐ ఏవి రమణ, ఎంపీపీ తనుజ రెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ విజయ శ్రీ, టిడిపి నాయకులు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నిరసన ర్యాలీ



సూళ్లూరుపేట, జూన్ 10 ప్రభాతవార్త: రాష్ట్ర రాజధాని అమరావతిపై ఓ మీడియాలో వచ్చిన వార్తలకు సంబంధించి స్థానిక తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆదేశాలతో స్థానిక పాండురంగ మందిరం వద్ద నుంచి బజారు వీధుల్లో ప్రదర్శన నిర్వహించి ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రదర్శనకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నేతలు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిని అవమానపరుస్తూ అక్కడ నివసించే మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మీడియా సంస్థ లైసెన్సును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, పచ్చా మాధవనాయుడు, ఎజి కిషోర్, మేడా సాయినారాయణ, ఆలీభాయ్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులపై పోలీసులు దాడులు

దొరవారి సత్రం, జూన్ 10 ప్రభాతవార్త: అక్రమంగా బెల్టు షాపులను దుకాణాలపై పోలీసులు తనిఖీలు చెపట్టారు.సోమవారం దొరవారి సత్రం మండల పరిధి లోని పూలతోట గ్రామంలో ఓ చిల్లర దుకాణ వ్యాపారి మద్యం అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు ఈ దాడుల్లో అక్రమంగా 48 మద్యం సీసాలను ఉండటంతో బాటిల్లను ఎస్సై జి.అజిత్‌కుమార్ సీజ్ చేశారు అనంతరం బెల్టు నిర్వాహుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు అనంతరం ఎస్సై అజిత్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైన సరే అక్రమంగా బెల్టు నిర్వహిస్తే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నిరుద్యోగ యువకులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే



నాయుడుపేట, జూన్ 10 ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత ం నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధికల్పనపై ప్రత్యేక దృష్టిపెడుతుందని సూళ్ళూరు పేట నియోజకవర్గ శాసనసభ్యులు నెలవల విజయశ్రీ తెలిపారు. నాయు డుపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతి, యువకులకు పెద్దపీట వేస్తుందన్నారు. జాబ్ మేళా కార్యక్రమం నిరంతరాయంగా జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని శ్రీసిటి, మేనకూరుకు చెందిన పలురకాల కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులు,పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం మెనూలో మామిడి జ్యూస్ చేర్చండి



పాకాల, జూన్ 10 ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమంలో ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూలో ప్రస్తుతం ఇస్తున్న వాటికి అదనంగా ఒక గ్లాస్ 200 ఎమ్ ఎల్ మామిడి జ్యూస్‌ని పిల్లలందరికీ ఇవ్వాలని పాకాల మండలం లోని మామిడి రైతుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందుతు న్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంతజిల్లాలో భారీ సంఖ్యలో మామిడి పండ్ల రైతులు ప్రస్తుతం గిట్టుబాటు ధర లేక ప్రభుత్వ సాయం కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జ్యూస్ ఫ్యాక్టరీలు గత ఏడాది తయారు చేసిన పల్ప్ ఎగుమతులలో ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర అనిస్థితి వలన జూస్ ఎగుమతులు ఆగిపోయి తయారైన జ్యూస్ వారి వద్దే ఉండిపోవటం ఒక కారణమైతే ప్రస్తుతం జ్యూస్ ఫ్యాక్టరీలలో గోడౌన్ కూడా ఖాళీ లేక దిక్కు తోచని స్థితిలో కంపెనీలు ఉండటం ప్రధాన కారణంగా తెలుస్తోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరి ఈ సంవత్సరం ప్రభుత్వం సూచించిన ధర చెల్లించి రైతుల వద్ద నుంచి పంటను కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు రూరల్, పూతలపట్టు, పాకాల, చంద్రగిరి, జీడి నెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు, పుత్తూరు, నగరి, వడమాలపేట, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో మామిడి తోటలు భారీగా విస్తరించాయి. ప్రతి ఏడాది ఐదు లక్షల మెట్రిక్ టన్నుల మామిడ్ దిగుబడి ఉంటుంది అని ఒక అంచనా. ప్రస్తుతం రైతును రాష్ట్రంలోని రైతులను గట్టెక్కించే దానికి ఉద్యానవనశాఖ సహకారంతో ప్రభుత్వమే కంపెనీల నుంచి మామిడి జ్యూస్‌ను కొనుగోలు చేసి రాష్ట్రంలోని పిల్లలందరికీ కూడా వారంలో కనీసం నాలుగు రోజులు మామిడి పండ్ల జ్యూస్ ఇవ్వగలిగితే పిల్లలలో నూతన ఉత్సాహం పెరిగి స్కూల్లో డ్రాప్‌అవుట్ తగ్గి పిల్లలు హాజరు పెరిగటమే కాకుండా రాష్ట్ర మామిడి రైతుకు అటు పిల్లలకు మేలు చేసేలా కూటమి ప్రభుత్వం కొత్తగా ఆలోచన చేయవలసినదిగా ప్రజలు కోరుతున్నారు.

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు మానుకోండి



సత్యవేడు, జూన్ 10 ప్రభాతవార్త: సాక్షి టీవీ, పత్రికలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ సత్యవేడులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో మమిళల ర్యాలీ తలదించుకునేలా మానవతా విలువలను గాలికి వదిలేసి మహిళలను కించపరిచేలా డిబేట్‌లను నిర్వహిస్తూ సామాజిక బాధ్యతలను కాలరాస్తున్న సాక్షి టీవీ, పత్రికలను తక్షణమే మూసి వేయాలని తెలుగుదేశం పార్ట సత్యవేడు పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు డిమాండ్ చేశారు. సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో సాక్షి కథనాలను వ్యతిరేకిస్తూ, మహిళలకు సమున్నత న్యాయం జరిగేలా సాక్షి యాజమాన్యంపై కఠిన చర్యలు చేపట్టాలని నినాదాలతో మంగళవారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో మహిళలు రోడ్డెక్కారు. సత్యవేడు పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపం నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా శోభారాణి అనే మహిళ మాట్లాడుతూ సాక్షి టీవీ వ్యవహార శైలిపై తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసే టిబెట్‌లను ఏలా ప్రసారం చేస్తారంటూ ప్రశ్నించారు. చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పినా, వైఎస్ జగన్‌కు ఇంకా కూడా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశ్వారు. పనిమాలిన టిబెట్‌లు పెట్టి పనికి మాలిన మాటలతో స్త్రీ జాతి గౌరవాన్ని దిగజార్చడమేనా సాక్షి టీవీ, పత్రికల ఉద్దేశం అంటూ మండి పడ్డారు. ఇందుకు ప్రధానంగా కారకులైన కృష్ణంరాజు, శ్రీనివాస్, సాక్షి మీడియా నిర్వాహకులపై కఠిన చర్యలను చేపట్టి, సాక్షి మీడియా కార్యాలయాలను మూసి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండలఅధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వీకేఎన్ బాషా, ఎం.ఎం.రవి, సంతోష్ నాయుడు, షణ్ముగం, ముదరిఆజ్, శశినాయుడు కోళ్ళ చిన్న(మురళి)లోకయ్య రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సురేంద్రరెడ్డి, శోభారాణి, సెల్వి, డేవిడ్, వినాయకం, వెంకటేశ్వరులు, రాజాశెట్టి, మోహన్, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## మానవ సేవయే మాధవ సేవగా హెల్పింగ్ హార్ట్స్




తిరుపతి కలెక్టరేట్, జూన్ 10 ప్రభాతవార్త : మానవ సేవయే మాధవ సేవగా హెల్పింగ్ హార్ట్స్ తమ కార్యకలాపాలను నిర్వహిసు న్నదని హెల్పింగ్ హార్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కల్లుపల్లి సురేందర్‌రెడ్డి, ట్రెజరర్ అడ్రాయిట్ ప్రణీత్‌రెడ్డిలు తెలిపారు. కలెక్టరేట్ సమీపంలోని ఆశ్రయ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిర్వహ కులు శోభారాణి, రమేష్‌లకు మంగళవారం హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు నిత్యావసర సరుకులను అందించారు. కల్లుపల్లి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ హెల్పింగ్ హార్ట్స్ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇకపై ప్రతి నెల 10వ తేదిన అనాథ ఆశ్రమాలు,వృద్ధాశ్రమాలు, ప్రత్యేక పునరావాసకేంద్రాలు, రోగులకు పలు విధాలుగా సేవా కార్యక్రమాలు చేయడానికి నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జయశంకర్, లోకేష్‌రెడ్డి, తిరుపాల్, మునిచంద్రారెడ్డి, రామ్మూర్తి, కల్లుపల్లి శశిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవాటు పడాలి: కోలా



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి దివ్యక్షేత్రం నిత్యం భక్తులతో కళ కళ లాడుతుం టుందని అలాగే నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక చింతన వెల్లి విరియాలని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ పిలుపు నిచ్చారు. మంగళవారం రాత్రి మండలంలోని ముచ్చివోలు గ్రామంలో జరుగుతున్న పాండురంగస్వామి తిరునాళ్ళులో భాగంగా అగ్నిగుండ ప్రవేశకార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు, ఆలయ కమిటి ఘనస్వాగతం పలికారు. యువకులు,యువతులు ఆయనతో సెల్ఫీలకు ఎగబడ్డారు. ప్రతి గ్రామంలోనూ ఆధ్యాత్మికత అలవాటు పడాలన్నారు. అందుకే దేవాలయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. ముచ్చివోలు గ్రామంలలో పాండురంగస్వామి తిరునాళ్ళభారీ ఎత్తున నిర్వహించటం ఈ గ్రామంలో ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం అన్నారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తి కో ఆపరేటివ్‌టౌన్‌బ్యాంకు చైర్మెన్ సురేష్ పాల్గొన్నారు.

## జాతరకు డ్రోన్ నిఘాలో పటిష్టమైన బందోబస్తు



సత్యవేడు, జూన్ 10 ప్రభాతవార్త: సత్యవేడులో గంగజాతరకు డ్రోన్ నిఘాలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తూ డ్రోన్ నిపుణులతో ముందస్తు రిహార్సల్‌నిర్వహించారు. మంగళవారం మూడు రోడ్లు కూడలిలోసీఐ మురళీనాయుడు జాతర జరగనున్న రెండు రోజులు సత్యవేడు పట్టణం, డ్రోన్ నిఘాలో పటిష్టమైన బందోబస్తుతో పాటు సత్యవేడు మండలకేంద్రంలో నిర్వహించే గంగజాతర స్థానికంగా ప్రసిద్ధి కావడంతో అనేక రాష్ట్రాల నుంచి ఇక్కడకు చేరుకునే భక్తులకు భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ సారి డ్రోన్ నిఘాలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నట్లు సీఐ మురళీనాయుడు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచనల మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ మార్గదర్శకాలతో సత్యవేడు గాంధీ విగ్రహం సమీపంలో జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చిన డ్రోన్ నిపుణులు దాస్‌తో కలసి సీఐ ముందస్తుగా డ్రోన్‌ను ఎగురవేసి రిహార్సల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రతి వీధి, పట్టణ పరిసర ప్రాంతాలు, బహిరంగప్రదేశాలు, సత్యవేడులో సున్నితమైన ప్రాంతాలను ముందస్తుగా మ్యాపింగ్ చేశారు. సీఐ మాట్లాడుతూ జాతర జరగనున్న బుధ, గురువారాల్లో సత్యవేడు పట్టణం పటిష్టమైన డ్రోన్‌నిఘాలో ఉంటుందన్నారు. సుమారు 2 వందల మంది పోలీసు బలగాలతో కూడిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసావుకార్యం కలగకుండా చూసే సదుద్దేశంతోనే ఏర్పాటు చేసినట్లు ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ రామస్వామి, పోలీసు కానిస్టేబుల్ సుమన్, డిల్లీ, ఈశ్వర్‌రెడ్డి, గురవయ్యలు పాల్గొన్నారు.

## సినీనటుడు బాలకృష్ణ పేరున

### అభిమాని 650 కొబ్బరికాయల మొక్కులు



తిరుమల, జూన్ 10ప్రభాతవార్తప్రతినిధి: హిందూపురం ఎమ్మెల్యే,సినీనటుడు నందమూరి బాలకృష్ణ ఆరోగ్యం, అష్టఐశ్వర్యాలతో ఉండాలని అభిమాని ,టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ శ్రీవేంకటేశ్వర స్వామిని వేడుకున్నారు. శ్రీధర్‌వర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం బాలకృష్ణ జన్మదినం సందర్భంగా అఖిలాండం వద్ద 650 కొబ్బరికాయలు కొట్టి, 6.50కిలోల కర్పూరం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

# గూడూరు డివిజన్

## ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



గూడూరు, జూన్ 10 ప్రభాతవార్త : ఇటు సినీ రంగం అటు రాజకీయ రంగంలో తండ్రికి తగ్గ తనయుడుగా నందమూరి బాలకృష్ణ రాణిస్తున్నారని బాలకృష్ణ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని గూడూరు పట్టణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా టిడిపి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పట్టణ మాజీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడుగా సినీ రంగంలో ఎంతో గుర్తింపు పొందారని అంతే కాకుండా బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ నుప్రారంభించి ఎంతోమంది క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అనుబంధ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## గంగమ్మ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు



గూడూరు, జూన్ 10 ప్రభాతవార్త : పట్టణంలోని రాజా వీధిలో ఉన్న శ్రీ గంగమ్మ పరమేశ్వర అమ్మవారి దేవస్థానంలో 14వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, చందనాలంకారం పుష్పాలంకరణ చేసి సర్వాంగ సుందరంగా అమ్మవారిని అలంకరించారు. అనంతరం భక్తులు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## కంప్యూటర్ పరికరాలు పంపిణీ




వాకాడు, జూన్ 10 ప్రభాతవార్త: ఆస్ట్రో టెక్ స్టీల్ కంపెనీ శ్రీసిటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం వాకాడు ఐటిఐ కళాశాలకు సుమారు పది లక్షల రూపాయలు విలువ చేసే కంప్యూటర్ పరికరాలు అందజేశారు. వాకాడు ఐటిఐ కళాశాల కు 15 కుర్చీలు, వాటర్ డిస్పెన్సరీ కూలింగ్, హెచ్పి లేజర్ ప్రింట్ రెండు, డెల్ కంపెనీకి చెందిన 15 కంప్యూటర్లు, ఇంటోరియల్ రేనోవేషన్ ఈ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ ఆస్ట్రో టెక్ స్టీల్ కంపెనీకి చెందిన ఎండి అరుణ్ మిరాండా, జే ఎం డి జై సన్ జోసెఫ్ వారికి కళాశాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు. కళాశాలకు ఇంటర్నెట్, వైఫై ఇవ్వాలని కంపెనీ ఎండిని ఆమె కోరారు, అనంతరం కంప్యూటర్ అమర్చిన రూమును అరుణ్ మీరండ రిబ్బన్ కటింగ్ చేపట్టారు. కళాశాల యాజమాన్యం ఎండి అరుణ్ మిరాండా, జే ఎం డి జై సన్ జోసెఫ్, కంపెనీ సిబ్బందికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ కళాశాల సంబంధించిన టెక్నికల్ అసిస్టెంట్స్, ఆస్ట్రోటెక్ స్టీల్ కంపెనీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధార్ స్పెషల్ క్యాంప్‌లు

కోట, జూన్ 10 ప్రభాతవార్త : మండలంలో ఆధార్ స్పెషల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ దిలీప్‌కుమార్ చెప్పారు. ఆ మేరకు మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీల్లో చిట్టేడు, గూడలి, కేశవరం, 12న ఊనుగుంటపాలెం, 13న కొక్కుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ క్యాంప్‌లు నిర్వహిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న ప్రజలు ఈ ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఎన్‌సిసి క్యాంప్



కోట, జూన్ 10 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకు నావెల్ యూనిట్ ఎన్‌సిసి క్యాంప్ జరుగుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ జెఎన్‌టియు పరిధిలో నెల్లూరు, తిరుపతి, గుంటూరు, ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల నుంచి 650 మంది ఎన్‌సిసి క్యాడెట్లు ఈ క్యాంప్‌లో పాల్గొంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గోదాంగవే, సూపరింట ెండెంట్ ముకుందసాగర్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌కుమార్‌లు కళాశాలలోని వసతి గృహాలను పరిశీలించి వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట నావెల్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

## విఆర్‌కు వెంకటగిరి ఎస్సై

వెంకటగిరి, జూన్ 10 ప్రభాతవార్త: ఎస్సై సుబ్బారావును విఆర్‌కు పంపిస్తూ జిల్లా ఎస్పీ రాష్ట్ర హర్షవర్ధన రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై సుబ్బారావు పై పలు ఆరోపణ రావడంతో ఆయనపై వీఆర్ వేటు పడింది. ఎస్సై పై ఎస్పీకి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లకు తమకు న్యాయం చేయడం లేదనికూడా స్థానికులు పలు ఫిర్యాదులు చేశారు. దీంతో ఎస్ఐని విఆర్‌ఓ పంపారు.

## ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని ధర్నా



వెంకటగిరి, జూన్ 10 ప్రభాతవార్త: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ కార్మికులు పారిశుధ్య కార్మికులు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ధర్నాని ఉద్దేశించి సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో ఎంఎస్ నెంబర్ 36 ప్రకారం లేదా జీవో ఆర్టీ నెంబర్ 16, 15 ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచే వరకు పోరాటం ఆగదని అన్నారు. గత 17 రోజుల సమ్మె సందర్భంగా ఆనాటి ప్రభుత్వం రాత పూర్వకంగా ఇచ్చిన ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్ 75000 చెల్లించాలని అన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం రాష్ట్ర కమిటీ తీర్మానం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా జాయింట్ సెక్రటరీ వల్లూరు పెంచలయ్య కార్యదర్శి ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, పి రమణయ్య, గోపాల్, హరిబాబు, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య , నరసింహులు, ధనలక్ష్మి, ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల గురించి మాట్లాడిన వారిని కఠినంగా శిక్షించాలి



గూడూరు, జూన్ 10 ప్రభాతవార్త: సాక్షి మీడియాలో అమరావతి రాజధాని మహిళల గురించి మాట్లాడినందుకు నిరసనగా శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ సతీమణి పాశిం సంధ్యారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు వాటర్ ట్యాంక్ నందున్న బి ఆర్ అంబేద్కర్ విగ్రహం కు పూలమాల వేసి నివాలర్పించి ర్యాలీగా బయలుదేరి మహిళలను కించపరిచిన సాక్షి మీడియాను రద్దు చేయాలనీ నినాదాలు చేస్తూ టవర్ క్లాక్ సెంటర్ నందు సాక్షి దినపత్రికలను తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళలు మట్టం శ్రావణి రెడ్డి గుండాల శ్రీదేవి, గుండాల లీలావతి, గుండాల భారతి, దువ్వూరు భారతి, ప్రమీల శ్రీలత, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలయ్య జన్మదిన వేడుకలు



నాయుడుపేట, జూన్ 10 ప్రభాతవార్త : పట్టణంలో బాలయ్య జన్మదిన వేడుకలను తెదేపా నాయకులు,అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ యూనియన్ గూడూరు డివిజన్ ప్రసిడెంట్ కందల కృష్ణరెడ్డి నాయుడుపేటలోని తన క్యాంపు కార్యాలయంలో తెదేపా నాయకులు, అభిమానుల మద్య బాణా సంచపేల్చి కేక్‌కట్ చేసి పలువురు అభిమానులకు పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ భాలకృష్ణ సినిమాలోనే కాకుండా నిత్య జీవితంలో కూడ హీరోగా ఉన్నారని అభివర్ణించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట తెదేపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## తామరపూలతో తాతయ్యగుంటగంగమ్మ దర్శనం

**-వేడుకగా రంగస్థలి కళాకారులు అమ్మవారికి మొక్కులు**

తిరుపతి, జూన్ 10ప్రభాతవార్త: తిరుపతి గ్రామ దేవత తాతయ్యగుంటగంగమ్మను మంగళవారం ఉదయం తామరపూలతో అలంకరించారు. జాతర ముగిసిన నాల్గవవారంలో ఈ అలం కరణలో భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు దర్శించుకు న్నారు. ఆలయ ఈఓ జయ కుమార్ చక్కటి దర్శనం చేయించారు.



**-రంగస్థలి కళాకారుల మొక్కులు:**

తాతయ్యగుంట గంగమ్మ జాతర వేడుకల్లో నాల్గవవారం మంగళవారం మధ్యాహ్నం రాయలసీమ రంగస్థలి కళాకారులు వేషధారణలతో ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ రకాల సాంప్రదాయ వేషధారణలతో గంధంవేషాలతో జేజేలు పలుకుతూ మంగళవాయిద్యాల నడుమ గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. చల్లంగా ఉండాలని సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం ఆనందంగా ఉండాలని వేడుకున్నారు. ఇక్కడ అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.